www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| శుక్రవారం | 06-06-2025 |


# హమ్ గరీబీ హఠాయే..!



**25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం**

**ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డిఎ కృషి**

**ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి**

**వాస్తవం, న్యూఢిల్లీ:**

పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడిరచారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి.

# కరుణించిన రేవంతుడు..!



## నన్ను కోసినా... ఏం చేయలేను...!

## రియలైజ్ అయిన సీఎం..!

- ఉద్యోగుల మనసు చూరగొనే యత్నం..
- కేబినెట్ నిర్ణయాల్లో వారికే అగ్ర తాంబూలం..!
- డీఏల చెల్లింపు, హెల్త్‌కార్డుల ఇష్యూలతో పాటు ప్రమోషన్లు, బదిలీలకు పచ్చజెండా..
- కొంత మేర సాధించామని సంతోషపడుతున్న ఉద్యోగ సంఘాలు..

**(దండుగుల శ్రీనివాస్)**

నిజంగా చెప్పాలంటే రేవంత్ నోరు జారాడు. నన్ను కోసినా ఏం చేయలేను. కోసుకుని తింటారా...? అని ఆయన మాట్లాడిన తీరు ఉద్యోగులను బాధించడమే కాదు.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఎన్నో ఆశలు పెట్టుకుని ఏరికోరి తెచ్చుకున్న సర్కార్ ఇలా చేస్తుందేమిటని విపరీతంగా బాధపడిపోయారు. సీఎం మాట్లాడిన తీరు ప్రభుత్వానికి కూడా తీవ్ర నష్టం చేకూరుస్తుందనే సమాచారం సీఎంకు అందింది. దీనిపై అధిష్టానం కూడా మందలించినట్టుంది. అందుకే ఇవాళ జరిగిన కీలక కేబినెట్ మీటింగులో మొత్తం ఉద్యోగుల గురించే చర్చించినట్టుంది. వారి గురించే నిర్ణయాలు తీసుకున్నట్టుంది. ఈ మీటింగే వాళ్ల గురించి పెట్టినట్టుంది. అంతకు మించి పెద్దగా ఏం మాట్లాడలేదు. నిర్ణయాలు తీసుకోలేదు. ఏవేవో ఊహించారు కానీ, ఏమీ లేదు. అంతా తుస్సుమనిపించారు. ఉద్యోగులు మాత్రం హ్యాపీ ఇదీ కేబినెట్ ముచ్చట

## ఉద్యోగులకు రెండు డీఏలు..



ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటించింది. ఒక డీఏను వెంటనే, రెండో డీఏను ఆరు నెలల్లోగా చెల్లిస్తారు. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్తగూడెం లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో స న్న ధాన్యం పండించే రైతులకు బోనస్ కొనసాగించేలా ఆమోదం తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 38.5 కోట్లతో ప్రమాద బీమా పథకా న్ని అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మొత్తం 13137 కిలోమీ టర్ల పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లను రూ. 33 వేల కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2బీ ప్రాజె క్టును 86.1కిలోమీటర్ల మేర రూ. 19579 కోట్లతో విస్తరించేందుకు కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టనున్నాయి.



# ఊ అంటారా.. ఉఉ అంటారా..!

**నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ**

**నేటి విచారణకు హాజరు కానున్న ఎంపి ఈటెల**

**9న హరీష్ రావు, 11న కెసిఆర్ విచారణకు హాజరు**

**హైదరాబాద్- వాస్తవం ప్రతినిధి:**

తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చింది. వీరిని విచారించేందుకు గురువారం కాళేశ్వరం కమిషన్ హైదరాబాద్ కు చేరుకుంది. విచారణలో భాగంగా శుక్రవారం బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను ప్రశ్నించనుంది. తర్వాత ఈనెల 9న బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు.. 11న మాజి సిఎం కెసిఆర్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి ప్రారంభోత్సవం వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రశ్నల వర్షం కురుపించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

## ప్రకృతో రక్షితి రక్షితః

- ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ
- అదే మనలను కాపాడుతుంది
- పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా ముందుకు రావాలి
- సిఎం రేవంత్ రెడ్డి పిలుపు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కార్యాలయం తరఫున ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. ప్రకృతిని మనం కాపాడితే, అదే మనల్ని కాపాడుతుందని సీఎం స్పష్టంగా తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణగా ఉన్న నేపథ్యంలో, ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించే దిశగా కృషి చేయాలని, దానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయాలని సీఎం కోరారు. సహజ వనరుల సంరక్షణకు ప్రతిసారీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, రాబోయే తరాల కోసం ఈ వనరులను నిలుపుదల చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఓ ప్రకటనను విడుదల చేశారు. చెట్లను పెంచాలి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. మన ఆరోగ్యం కోసం కాదు, మన భవిష్యత్ తరాల భద్రత కోసమూ పర్యావరణాన్ని కాపాడాలని అంటూ ఆమె పిలుపునిచ్చారు.



# సీతక్కా... ఇదేం నిర్ణయమక్కా..!

**ఆడబిడ్డల్ని పడేస్తే కఠినంగా శిక్షస్తామనండి..!**

**చెట్లకు ఊయలలు కడతాం.. అందులో వేయండంటారా..!**

**ఎవరిస్తున్నారు మీకీ సలహాలు..**

**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

సీతక్క నోటి వెంట ఇలా కామెంట్లు వస్తాయనుకోలేదు. ఆమె ఇలాంటి ప్రకటన చేయడం ఆశ్చర్యమే అనిపించింది. పుట్టిన పసికందుల్ని పడేసే వారిని కఠినంగా శిక్షిస్తామని భయపెట్టాల్సింది పోయి... చెట్లకు ఊయలలు కడతాం.. అందులో వేయండని అనడమేంటో .. ఎవరిస్తున్నారో ఈ సలహాలు. అసలే రేవంత్‌కు ఉండే తలనొప్పులు వేరే ఉన్నాయి. ఇగో ఇలా మధ్యలో మంత్రులు చేసే కామెంట్లు, చేష్టలు మరింత ఇబ్బందికరంగా, నవ్వుల పాలు చేసేవిగా, చులకనగా చూసేలా చేస్తున్నాయి. కాదంటారా..?

త్వరలో మహిళల హక్కుల విరీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని.. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మధన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు– జరిగిన మేధో మధన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను, హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి విరీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.



# ఈ గట్టునే ఉంటాం..!

**తాజా మాజీలను కాదని అక్క చెంతకు చేరిన ఇందూరు నేతలు..**

**(దండుగుల శ్రీనివాస్)**

నిజామాబాద్‌లో ఆమె ఆటలు సాగనివ్వలేదు మొన్నటి వరకు. ఆమెను కలిస్తే చాలు.. దూరం పెట్టేవారు ఎమ్మెల్యేలు. ఇప్పుడు వారు తాజా మాజీలు. అక్క వేరు కుంపటి పెట్టనుందని తేలింది. తాజా మాజీలపై మామూలుగా లేదు కోపం. అందుకే ఇప్పుడు ఏ గట్టునుండాలో తేల్చుకునే సమయం వచ్చింది. అన్నతో విబేధించి, తండ్రితో కయ్యం పెట్టుకుని తన దారి తాను చూసుకునే పనిలో ఉన్న అక్క .. ఇవాళ తన సొంతూరు ఇందూరు వచ్చింది. అంతా ఆసక్తి. ఆమెను కలుస్తారా..? అని. ఎందుకంటే గతంలో ఆమెతో ఫోటో దిగితే చాలు ఎమ్మెల్యేలు దగ్గరికి రానిచ్చేవారు కాదు. అరేయ్ వాడు ఆ గ్రూపురా పక్కన పట్టేసేయండి.. అని బాహాటంగానే ఆర్డర్ వేసేవారు ఆనాటి ఆ పార్టీ సిట్టింగులు. ఇచ్చిన వారికే టికెట్లిచ్చి.. వ్యతిరేకతను కూడా లెక్క చేయకుండా కేసీఆర్ చేసిన తప్పుకు.. ఆ పార్టీ ఇందూరులో నామ రూపాల్లేకుండా పోయింది. ఇంత జరిగినా ఇంకా ఆ తాజా మాజీలను పట్టుకునే వేలాడాలా..? అందులోనూ అక్క ఓపెన్‌గా చెప్పేసింది లేఖలో తండ్రికి. ఇంకా వారేనా ఇంచార్జిలు.. వాళ్లే బీ ఫారాలు ఇవ్వాలా..? నో నత్తింగ్. నడవదు. మీ నుంచే రావాలి.. అన్నది. ఈ మాట బాగా నచ్చింది వారికి. అందుకే అక్క పంచన చేరారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో తాజా మాజీల కబంధ హస్తాల ద్వారా కాకుండా కొన్ని అక్క చేతుల మీదుగా బీ ఫారాలు వస్తాయని క్లారిటీ వస్తోంది వారికి. అందుకే పో పోవోయ్.. ఏం చేసుకుంటావో చేస్కో..? ఇంకా ఎన్ని రోజులు నీకు భయపడుకుంటా ఉండాలె అంటూ అక్క దగ్గర వచ్చేశారు బాజాప్తాగా. భయం లేకుండా. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని. ఇప్పుడిది హాట్ టాపిక్‌గా మారింది ఇందూరు బీఆరెస్ రాజకీయాల్లో.